# తొలివెలుగు

జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 125 18-5-2026 వెల: రూ.2/- పేజీలు: 06



విలేకరులు కావలెను

తొలివెలుగు జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

www.epaper.tholivelugu.com

Contacts

తెలంగాణ

94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.




## తిరుమలలో పెట్రోల్, డీజిల్ వాహనాలకు భారీగా టోల్ ఫీజు...

- తిరుమలలో పెట్రోల్, డీజిల్ వాహనాలపై భారీ టోల్ విధింపునకు టీటీడీ యోచన
- ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించి, పర్యావరణాన్ని కాపాడటమే ప్రధాన లక్ష్యం
- అలిపిరి వద్ద రూ.500 కోట్లతో అన్ని సౌకర్యాలతో భారీ టౌన్‌షిప్ నిర్మాణం
- తిరుమలను 'సైలెన్స్ జోన్'గా మార్చి, శబ్ద కాలుష్యాన్ని 80 శాతం తగ్గించేందుకు ప్రణాళిక
- రూ.100 కోట్లతో అన్నదానం వంటశాల ఆధునీకరణ, ఏఐ ఆధారిత నిర్వహణ

2లో

## నరసరావుపేట డీఎస్పీకి తన పాస్‌పోర్ట్ అప్పగించిన విడదల రజని

డీఎస్పీ కార్యాలయానికి వెళ్లి పాస్‌పోర్ట్ అప్పగించిన విడదల రజని

అట్రాసిటీ కేసులో హైకోర్టు షరతులతో కూడిన ఆదేశం

విదేశాలకు వెళ్లకుండా పాస్‌పోర్ట్ స్వాధీనం చేసుకున్న పోలీసులు

ఇప్పటికే ఏసీబీ కేసుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న మాజీ మంత్రి



### ఆక్వా, పొగాకు రైతుల కోసం...

# కేంద్రానికి చంద్రబాబు లేఖలు

- ఆక్వా, పొగాకు రైతుల సమస్యలపై కేంద్రానికి సీఎం చంద్రబాబు లేఖలు
- రొయ్యల మేత ధరల పెరుగుదలపై జోక్యం చేసుకోవాలని వినతి
- సిగరెట్లపై పెంచిన పన్నులను పునఃసమీక్షించాలని అభ్యర్థన
- మేత ధరల నియంత్రణకు నెలవారీ విధానంపై రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు
- రైతుల ప్రయోజనాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

ఆంధ్రప్రదేశ్‌లోని ఆక్వా, పొగాకు రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టి సారించారు. వారిని ఆదుకునేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి వేర్వేరుగా లేఖలు రాశారు. రొయ్యల మేత ధరల పెరుగుదల, పొగాకుపై అధిక పన్నుల భారం వంటి కీలక అంశాలపై తక్షణమే జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**ఆక్వా రైతులకు ఊరట కల్పించండి..**

రాష్ట్రంలో రొయ్యల మేత ధరలు విపరీతంగా పెరగడంపై ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో సీఎం చంద్రబాబు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు లేఖ రాశారు. 2026 జనవరి నుంచి మే మధ్య కాలంలో సోయా, ఫిష్ మీల్ వంటి ముడిసరుకుల ధరలు 20 శాతానికి పైగా పెరిగాయని, దీంతో మేత తయారీ ఖర్చు కిలోకు రూ.31కి పైగా పెరిగిందని లేఖలో ప్రస్తావించారు. ముడిసరుకుల ధరలు తగ్గినప్పుడు రైతులకు ప్రయోజనం బదిలీ చేయని కంపెనీలు, ఇప్పుడు భారాన్ని మోపడం సరికాదని రైతులు వాదిస్తున్నారని తెలిపారు.

- మిగతా 2వ పేజీలో



## 2 రోజులు వర్క్ ఫ్రమ్ హోమ్

కార్ పూలింగ్, ఆఫీస్ వేళల్లో మార్పులు

ఇంధన పొదుపులో భాగంగా ప్రైవేట్ సంస్థలకు ఢిల్లీ ప్రభుత్వ సలహా

2లో

## ఇక నాలుగు కేటగిరీలుగా తెలంగాణ ఉద్యమకారులు

- కేశవరావు నేతృత్వంలో తొలిసారిగా సమావేశమైన ఉన్నతస్థాయి కమిటీ
- ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన వారికి తొలి ప్రాధాన్యం
- రాజకీయాలకు అతీతంగా, పక్షపాతం లేకుండా గుర్తింపు ప్రక్రియ
- జిల్లాల పర్యటనలు, అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని నిర్ణయం



## బండి సంజయ్ కేంద్ర మంత్రి పదవిలో కొనసాగడం దేశానికే అవమానం: కేటీఆర్

- పోక్సో కేసులో బండి సంజయ్ కుమారుడు అరెస్ట్
- ఈ నేపథ్యంలోనే కేటీఆర్ విమర్శలు
- నిందితుణ్ని 9 రోజులు కేంద్ర మంత్రే దాచారని ఆరోపణ
- బాధిత కుటుంబాన్ని బెదిరించారన్న కేటీఆర్

కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌ను కేంద్ర మంత్రివర్గం నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. ఎల్బీనగర్‌లో నిర్వహించిన 'నా బూత్- నా భవిష్యత్తు' కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బండి సంజయ్ కుమారుడు భగీరథ్ పోక్సో కేసులో అరెస్టైన నేపథ్యంలో ఆయన ఈ విమర్శలు చేశారు.రాష్ట్రంలో ఒక బాలికకు తీవ్ర అన్యాయం జరిగితే ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకుండా మిన్నకుండిపోయిందని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కలిసి బాధితురాలికి అన్యాయం చేయాలని చూశాయని విమర్శించారు. కానీ ఆ బాలికకు

2లో

## 7,074 మంది లబ్ధిదారులకు అందనున్న ఆర్థిక సాయం



# సహకారమే మన బలం

- కీలక రంగాల్లో పరస్పరం సహకరించుకుందాం
- భారత ప్రధాని మోదీ, స్వీడన్ ప్రధాని ఉల్ఫ్ క్రిస్టర్సన్ నిర్ణయం
- బంధాన్ని వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి పెంచాలని నిర్ణయం

గోథెన్‌బర్గ్: సహకారమే మన బలమని భారత ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. మోదీ ఆదివారం స్వీడన్ ప్రధానమంత్రి ఉల్ఫ్ క్రిస్టర్సన్‌తో సమావేశమ్యారు. ఇరుదేశాల మధ్య సంబంధాలపై విస్తృతంగా చర్చించారు. ద్వైపాక్షిక సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్యంగా మార్చుకోవాలని ఈ సందర్భంగా ఇరుదేశాలు అంగీకరించాయి. భారత్‌ఈయూ వ్యూహాత్మక భాగస్వామ్యం, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం స్ఫూర్తితో తమ ప్రజల ప్రయోజనం కోసం కొత్త




## ఆ ఆరు రోజులు తెలుగు రాష్ట్రాల్లో నిప్పుల వర్షమే!

- తెలుగు రాష్ట్రాలకు వాతావరణ శాఖ తీవ్ర హెచ్చరిక
- మే 19 నుంచి 24 వరకు అత్యంత తీవ్రంగా వడగాలులు
- 45 డిగ్రీలు దాటి రికార్డు స్థాయి ఉష్ణోగ్రతల నమోదుకు అవకాశం
- ఉదయం 10:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు వెళ్లవద్దని సూచన
- వృద్ధులు, చిన్నారులు, గర్భిణీలు, రోగులు మరింత అప్రమత్తంగా ఉండాలని సలహా

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఎండలు దంచికొట్టనున్నాయి. రానున్న వారం రోజుల పాటు ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా మే 19 నుంచి 24వ తేదీ వరకు ఆరు రోజుల పాటు భానుడి ప్రతాపం చుక్కలు చూపించనుందని,

- మిగతా 2వ పేజీలో

# ఆ ఆరు రోజులు తెలుగు రాష్ట్రాల్లో నిప్పుల వర్షమే!

(మొదటి పేజీ తరువాయి)

బలమైన వడగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. ఈ రోజుల్లో పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల మార్కును దాటి రికార్డు స్థాయిలో నమోదయ్యే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. వాతావరణ శాఖ నివేదికల ప్రకారం, ఈ ఆరు రోజుల్లో వడగాల్పుల ప్రభావం అత్యంత తీవ్రంగా ఉండనుంది. దీనివల్ల వడదెబ్బ తగిలి ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉన్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రధానంగా ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 4:00 గంటల మధ్య అత్యవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావద్దని స్పష్టం చేశారు. బయటకు వెళ్లాల్సి వస్తే తప్పనిసరిగా తాగునీటి బాటిల్‌ను వెంట ఉంచుకోవాలని, వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలని సూచించారు. శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఉండేందుకు కొబ్బరి బొండాలు, మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణం వంటివి ఎక్కువగా తీసుకోవాలని వైద్యులు సలహా ఇస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీ స్త్రీలు, రోగులు ఈ కాలంలో ఎండకు దూరంగా, సురక్షితమైన ప్రదేశాల్లోనే ఉండటం శ్రేయస్కరం.

# ఆక్వా, పొగాకు రైతుల కోసం... కేంద్రానికి చంద్రబాబు లేఖలు

ఈ నేపథ్యంలో ఫిష్ మీల్ ఎగుమతులకు ప్రోత్సాహకాలు ఇవ్వాలని, సోయా దిగుమతులపై ఆంక్షలు సడలించాలని కేంద్రాన్ని కోరారు. మరోవైపు, పౌల్ట్రీ తరహాలో ముడిసరుకుల ధరల ఆధారంగా మేత ధరలను ప్రతి నెలా సమీక్షించే విధానాన్ని తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది.

**పొగాకు రైతులను ఆదుకోండి..**

ఇదే సమయంలో, ఎఫ్‌సీవీ పొగాకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపైనా సీఎం దృష్టి సారించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు వేర్వేరు లేఖలు రాశారు. సిగరెట్లపై జీఎస్టీ, ఎక్సైజ్ డ్యూటీని భారీగా పెంచడం వల్ల కొనుగోళ్లు మందగించాయని, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వివరించారు. గతేడాది వేలంలో కిలోకు రూ.280 ఉన్న ప్రారంభ ధర, ఈ ఏడాది రూ.250కి పడిపోయిందని తెలిపారు. ఈ పన్నుల విధానం వల్ల 43 వేల మంది రైతులు, లక్షలాది మంది కార్మికుల జీవనోపాధి ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు పెంచిన పన్నులను పునఃసమీక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని చంద్రబాబు కోరారు.

# తిరుమలలో పెట్రోల్, డీజిల్ వాహనాలకు భారీగా టోల్ ఫీజు...

తిరుమల పవిత్రతను కాపాడుతూ, పర్యావరణ హితమైన ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) భారీ సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా తిరుమల కొండపైకి వెళ్లే పెట్రోల్, డీజిల్ వాహనాలపై భారీగా టోల్ ఫీజు విధించాలని యోచిస్తోంది. ఎలక్ట్రిక్ వాహనాలకు (ఈవీ) ప్రోత్సాహం కల్పించడంతో పాటు, అలిపిరి వద్దే రూ.500 కోట్లతో ఒక భారీ టౌన్‌షిప్‌ను నిర్మించాలని ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ మేరకు టీటీడీ ఈవో ఎం. రవిచంద్ర కీలక వివరాలను వెల్లడించారు. ప్రస్తుతం రోజుకు సగటున 8,000 వాహనాలు తిరుమలకు వస్తుండటంతో పర్యావరణ, శబ్ద కాలుష్యం పెరుగుతోందని రవిచంద్ర తెలిపారు. దీన్ని నివారించేందుకు ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో పెట్రోల్, డీజిల్ వాహనాలపై భారీ టోల్ విధించనున్నారు. అయితే, ఈ నిర్ణయం వెంటనే అమలులోకి రాదని, భక్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. ఎలక్ట్రిక్ వాహనాలకు టోల్ ఫీజు నుంచి మినహాయింపు ఇచ్చి, వాటి కోసం ప్రత్యేకంగా చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఈ ప్రణాళికలో మరో కీలకమైన అంశం అలిపిరి వద్ద రూ.500 కోట్ల వ్యయంతో భారీ టౌన్‌షిప్ నిర్మాణం. సుమారు 150 ఎకరాల్లో నిర్మించే ఈ టౌన్‌షిప్‌లో వసతి, పార్కింగ్, భోజన సౌకర్యాలు, పూజా సామగ్రి వంటి అన్ని సదుపాయాలు కల్పించనున్నారు. "దీన్ని తిరుమల కొండ దిగువ భాగంలో అభివృద్ధి చేస్తాం" అని ఈవో తెలిపారు. భక్తులు ఇక్కడే తమ మొక్కులు తీర్చుకుని, ఆ తర్వాత దర్శనం కోసం కొండపైకి వెళ్లేలా ఏర్పాట్లు చేయనున్నారు. వీటితో పాటు, తిరుమలను కఠినంగా 'సైలెన్స్ జోన్'గా అమలు చేసి, శబ్ద కాలుష్యాన్ని 80 శాతం వరకు తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రూ.100 కోట్లతో అన్నదానం వంటశాలను ఆధునికీకరించడం, క్యూలైన్లకు బదులు భక్తులను నేరుగా అన్నదానం హాల్స్‌కు పంపడం వంటి చర్యలు కూడా చేపట్టనున్నారు. ఈ సంస్కరణల ద్వారా భక్తులను నిరుత్సాహపరచడం కాదని, వారి దర్శనాన్ని మరింత ప్రశాంతంగా, ఆధ్యాత్మికంగా మార్చడమే తమ ఉద్దేశమని ఈవో రవిచంద్ర వివరించారు.

# వితంతువులకు శుభవార్త.. ఏపీలో జూన్ 12 నుంచి కొత్త పింఛన్లు



రాష్ట్రంలోని వితంతువులకు ఏపీలోని కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా జూన్ 12వ తేదీ నుంచి కొత్తగా పింఛన్లు మంజూరు చేయనున్నట్లు రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రకటించారు. శ్రీకాకుళం జిల్లా నిమ్మాడలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, అర్హులైన లబ్ధిదారులు త్వరలోనే ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన అనంతరం ఆయన అధికారులతో మాట్లాడారు. గత ప్రభుత్వ వైఫల్యాల వల్ల అనేక రెవెన్యూ సమస్యలు పేరుకుపోయాయని, వాటిని పరిష్కరించేందుకు అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

# సహకారమే మన బలం



అవకాశాలను అన్వేషించాలని నిర్ణయించారు. వ్యాపారం, వాణిజ్యం, టెక్నాలజీ, రక్షణ సహా కీలక రంగాల్లో పరస్పర సహకారంపై సంప్రదింపులు జరిపారు. సహకారమే మన బలమని ఉద్ఘాటించారు. రెండో రోజుల పర్యటన నిమిత్తం నెదర్లాండ్స్ నుంచి ఆదివారం ఉదయం స్వీడన్‌లోని గోథెన్‌బర్గ్‌కు చేరుకున్న మోదీకి ఘనస్వాగతం లభించింది. మోదీ గౌరవార్థం ఆయన ప్రయాణించిన విమానానికి స్వీడన్ ఎయిర్‌ఫోర్స్ విమానాలు ఎస్కార్ట్‌గా వచ్చాయి. గోథెన్‌బర్గ్ ఎయిర్‌పోర్టులో మోదీకి స్వీడన్ ప్రధాని ఉల్ఫ్ క్రిస్టర్సన్ సాదర స్వాగతం పలికారు. మోదీకి స్వాగతం పలకడానికి స్వీడన్‌లోని ప్రవాస భారతీయులు తరలివచ్చారు. మోదీ రాకను పురస్కరించుకొని నిర్వహించిన సంగీత ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం మోదీ, క్రిస్టర్సన్ మధ్య ప్రతినిధుల స్థాయి భేటీ జరిగింది. ఇరు పక్షాలు ద్వైపాక్షిక సంబంధాలను సమీక్షించారు. ద్వైపాక్షిక వాణిజ్యాన్ని పెంపొందించడానికి అందుబాటులో ఉన్న నూతన మార్గాలపై చర్చించారు. హరిత పరివర్తన, కృత్రిమ మేధ(ఏఐ), వర్ధమాన సాంకేతికతలు, స్టార్టప్‌లు, సప్లై చైన్లు, రక్షణ, అంతరిక్షం, వాతావరణ చర్యలు సహా ప్రజల మధ్య సంబంధాల విషయంలో ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవడంపై భారత్, నెదర్లాండ్స్ ప్రత్యేకంగా దృష్టి సారించాయి.

**ప్రధాని మోదీకి 'పోలార్ స్టార్' గౌరవం**

ప్రధాని మోదీ స్వీడన్ అత్యున్నత పురస్కారం 'రాయల్ ఆర్డర్ ఆఫ్ పోలార్ స్టార్, డిగ్రీ కమాండర్ గ్రాండ్ క్రాస్'అందుకున్నారు. ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి చేసిన కృషి, దూరదృష్టి కలిగిన నాయకత్వానికి గుర్తింపుగా ఈ పురస్కారం అందజేసినట్లు స్వీడన్ యువరాణి విక్టోరియా ప్రకటించారని విదేశాంగ శాఖ తెలిపింది.

**భారత్, నెదర్లాండ్స్ మధ్య ఇక వ్యూహాత్మక భాగస్వామ్యం**

ద హేగ్: అంతర్జాతీయ భౌగోళిక పరిస్థితుల నేపథ్యంలో భారత్, నెదర్లాండ్స్ దేశాలు తమ సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్యంగా మరింత ఉన్నతస్థాయికి తీసుకెళ్లాయి. ఇకపై ఇరుదేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం కొనసాగుతుంది. భారత ప్రధాని నరేంద్ర మోదీ శనివారం నెదర్లాండ్స్‌లో పర్యటించారు. ఆ దేశ ప్రధానమంత్రి రోబ్ జెటెన్‌తో సమావేశమయ్యారు. ఇరుదేశాలు మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా రక్షణ, అరుదైన ఖనిజాలు సహా కీలక రంగాల్లో పరస్పర సహకారం కోసం 17 ఒప్పందాలపై భారత్, నెదర్లాండ్స్ సంతకాలు చేశాయి. పశ్చిమాసియా పరిణామాలపై ఇద్దరు ప్రధానమంత్రులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇంధన సరఫరాలో అంతరాయాల వల్ల ప్రపంచదేశాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వెల్లడించారు. భేటీ తర్వాత వారిద్దరూ ఒక ఉమ్మడి ప్రకటన విడుదల చేశారు.

# ఇక నాలుగు కేటగిరీలుగా తెలంగాణ ఉద్యమకారులు

తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీ కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు నేతృత్వంలోని ఈ కమిటీ ఆదివారం తొలిసారి సమావేశమై, అసలైన ఉద్యమకారులను నాలుగు కేటగిరీల కింద గుర్తించాలని తీర్మానించింది. ఈ ప్రక్రియను రాజకీయాలకు అతీతంగా, అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తామని కమిటీ స్పష్టం చేసింది. సమావేశం అనంతరం కమిటీ తీసుకున్న నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు. దీని ప్రకారం, తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఉద్యమ సమయంలో గాయపడిన వారిని రెండో కేటగిరీలో, అరెస్టులు, జైలు జీవితం, కేసులు ఎదుర్కొన్న వారిని మూడో కేటగిరీలో చేర్చనున్నారు. ఇక క్షేత్రస్థాయిలో ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న వారిని నాలుగో కేటగిరీ కింద గుర్తించనున్నారు. వీరిని గుర్తించేందుకు అప్పటి వార్తాపత్రికల క్లిప్పింగులను ఆధారంగా తీసుకోనున్నారు. గత ప్రభుత్వం కొద్దిమందికి మాత్రమే లబ్ధి చేకూర్చిందని, తమ ప్రక్రియ అలా ఉండదని కమిటీ తేల్చిచెప్పింది. ఉద్యమకారుల గుర్తింపునకు కఠినమైన ప్రమాణాలను రూపొందిస్తామని, సంక్షేమ పథకాలు, ప్రభుత్వ గౌరవం అందించేందుకు సమగ్ర డేటాబేస్ సిద్ధం చేస్తామని పేర్కొంది. 1969, 1972, 1996 నాటి ఉద్యమకారులతో పాటు వివిధ ఉద్యోగ, కుల, న్యాయవాద, కళాకారుల జేఏసీల నుంచి కూడా సూచనలు స్వీకరించాలని కమిటీ నిర్ణయించింది. అమరవీరుల జ్యోతి ప్రాంగణంలో కమిటీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని, త్వరలో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని, అలాగే అభిప్రాయ సేకరణ కోసం జిల్లాల పర్యటనలు చేపట్టాలని సమావేశంలో తీర్మానించారు. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీలు ప్రొఫెసర్ కోదండరాం, అద్దంకి దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

# నరసరావుపేట డీఎస్పీకి తన పాస్‌పోర్ట్ అప్పగించిన విడదల రజని

మాజీ మంత్రి, వైసీపీ నేత విడదల రజని తన పాస్‌పోర్ట్‌ను నరసరావుపేట డీఎస్పీ కార్యాలయంలో అప్పగించారు. తనపై నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో ముందస్తు బెయిల్ కోసం హైకోర్టు విధించిన షరతుల మేరకు ఆమె ఈ చర్య తీసుకున్నారు. ఆదివారం నాడు ఆమె డీఎస్పీ కార్యాలయానికి వచ్చి పాస్‌పోర్ట్‌ను పోలీసులకు అందజేశారు. వివరాల్లోకి వెళితే, చిలకలూరిపేటకు చెందిన టీడీపీ నేత పిల్లి కోటి ఇచ్చిన ఫిర్యాదు మేరకు యడ్లపాడు పోలీసులు విడదల రజిని, ఆమె అనుచరులపై అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ కేసులో అరెస్టు కాకుండా ఉండేందుకు రజిని హైకోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం, ఆమె విదేశాలకు వెళ్లకుండా పాస్‌పోర్ట్‌ను తక్షణం పోలీసులకు అప్పగించాలని షరతులతో కూడిన ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఆదేశాలను పాటిస్తూ, విడదల రజిని తన న్యాయవాదులతో కలిసి నరసరావుపేట డీఎస్పీ హనుమంతరావును కలిశారు. పాస్‌పోర్ట్‌ను ఆయనకు అందజేసి, సంబంధిత రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఈ సందర్భంగా పోలీసులు ఆమె వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా డీఎస్పీ కార్యాలయం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# 2 రోజులు వర్క్‌ఫ్రమ్ హోమ్

న్యూఢిల్లీ: ప్రపంచ అనిశ్చితుల నేపథ్యంలో ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వం ఇంధన పొదుపు ప్రయత్నాలను చేపట్టింది. ప్రైవేట్ కంపెనీలు రెండు రోజుల వర్క్‌ఫ్రమ్‌హోమ్ విధానాన్ని అమలుచేయాలని, ఆఫీసు పనివేళలను మార్చుకోవాలని, ఉద్యోగులు కార్ పూలింగ్, ప్రజా రవాణా వ్యవస్థను వినియోగించుకోవాలని సూచించింది. ఈ మేరకు ఢిల్లీ కార్మిక శాఖ ఆదివారం అడ్వైజరీని జారీ చేసింది. వర్క్‌ఫ్రమ్‌హోమ్ వల్ల ఇంధన వినియోగాన్ని పెద్ద మొత్తంలో నివారించవచ్చని పేర్కొంది. 'జాతీయ ఇంధన పొదుపు ప్రయత్నాలకు తోడ్పడేందుకు, ఢిల్లీలోని ఐటీ, ఐటీ ఎనేబుల్డ్ సర్వీసెస్, పారిశ్రామిక సంస్థలు, కర్మాగారాలు, దుకాణాలు, వాణిజ్య సంస్థల యజమానులందరూ వారానికి కనీసం రెండు రోజుల పాటు వర్క్‌ఫ్రమ్‌హోమ్‌ను అమలు చేయాలి. రద్దీ సమయాల్లో రహదారులపై వాహనాల భారాన్ని తగ్గించడానికి విడతల వారీగా పని గంటలను అమలు చేయాలి. ఉద్యోగులను ప్రజా రవాణా, కార్‌పూలింగ్ లేదా మోటారు రహిత ప్రయాణ మార్గాలను ఉపయోగించుకునేలా ప్రోత్సహించాలి' అని అడ్వైజరీలో సూచించింది. ఆసుపత్రులు, ఇతర ఆరోగ్య సంస్థలు, విద్యుత్, నీరు, పారిశుధ్యం, సంబంధిత మున్సిపల్ సేవలు వంటి అత్యవసర ప్రైవేట్ సంస్థలకు మినహాయింపునిచ్చింది. ప్రపంచవ్యాప్తంగా ఇంధన కొరత కారణంగా వనరులను తెలివిగా ఉపయోగించుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ విజ్ఞప్తి మేరకు ఇంధన పొదుపు కార్యక్రమాలకు మద్దతివ్వాలని ప్రైవేట్ రంగాన్ని కోరనున్నట్లు ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా తెలిపారు. ఈ వారం ప్రారంభంలో ఆమె 90 రోజుల 'మేరా భారత్, మేరా యోగ్‌దాన్'ఇంధన పొదుపు ప్రచారాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

# బండి సంజయ్ కేంద్ర మంత్రి పదవిలో కొనసాగడం దేశానికే అవమానం: కేటీఆర్

న్యాయం జరిగేలా బీఆర్ఎస్ పార్టీ మాత్రమే పోరాడిందని తెలిపారు. గత రెండున్నరేళ్లుగా తెలంగాణలో శాంతిభద్రతలు పూర్తిగా దిగజారాయని ఆరోపించారు. ప్రధాని మోదీ చెబుతున్న 'బేటీ పడావో.. బేటీ బచావో' నినాదం కేవలం మాటలకే పరిమితమైందని విమర్శించారు. దేశ చరిత్రలో బహుశా మొదటిసారి ఓ కేంద్రమంత్రి కుమారుడిపై లుకౌట్ సర్క్యులర్ ఇచ్చే పరిస్థితి వచ్చిందని కేటీఆర్ అన్నారు. బండి సంజయ్‌ను మంత్రి పదవి నుంచి తొలగించకపోతే ఈ కేసులో విచారణ సరిగా జరగదని అనుమానం వ్యక్తం చేశారు. తప్పు చేసిన వ్యక్తిని దాదాపు 9 రోజుల పాటు దాచిపెట్టింది కేంద్రమంత్రేనని ఆరోపించారు. బాధితురాలి తల్లిదండ్రులను భయభ్రాంతులకు గురి చేసి కేసును నీరుగార్చాలని చూశారన్నారు. ఇలాంటి వ్యక్తులు ఉన్నతమైన పదవుల్లో కొనసాగడం

# రైతు హామీలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే.. ధాన్యం కొనుగోళ్లపై కేంద్ర మంత్రి ఫైర్..

రాష్ట్ర ప్రభుత్వ హామీలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లు ఉందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. రైతుల విషయంలో ధాన్యం కొనుగోలు చేయలేని పరిస్థితి ఉందని విమర్శించారు. తాజాగా నాంపల్లిలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడారు. రుణమాఫీ విషయంలో చాలా మంది రైతులు బ్యాంకుల్లో డిఫల్టర్లుగా మారారని.. రైతులు అనేక ప్రాంతాల్లో రోడ్ల పైకి వచ్చి ధర్నాలు చేయాల్సిన పరిస్థితి ఉందని ఆరోపించారు. రైతుల విషయంలో కేంద్ర ప్రభుత్వం అండగా ఉన్నా.. ఎందుకు రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందుతుందో అర్థం కావడం లేదన్నారు.. ఖూూ హయాం కంటే ధాన్యం గిట్టుబాటు ధరను కేంద్రం పెంచిందని చెప్పారు. అయినా కూడా కొనుగోలు విషయంలో ఎందుకు విఫలం అవుతున్నారో తెలియడం లేదని.. మంత్రులు కౌంటర్ల ఇవ్వడం పైనే పనిచేస్తున్నారు తప్పా కొనుగోలు విషయంపై దృష్టి పెట్టడం లేదని విమర్శించారు. మద్దతు ధర పెంచి బోనస్ ఇస్తామని అన్నారు.. ఆ తరువాత సన్న వడ్లకు మాత్రమే అన్నారని గుర్తు చేశారు. ఆరుగాలం పండించి తెచ్చి కళ్ళల్లో పెడితే కొనే దిక్కులేదని అసహనం వ్యక్తం చేశారు. బస్తాలు, సుతిలి దారం నుంచి అన్ని కేంద్రం అందిస్తుందని చెప్పారు. నిల్వ కేంద్రాల ఖర్చు కూడా కేంద్రమే ఇస్తుందన్నారు.

అయినా కూడా కొనుగోలు ఎందుకు జరగడం లేదో ప్రభుత్వం చెప్పాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు.. "ప్రతి కేజీకి 40 రూపాయలు కేంద్రమే ఇస్తుంది. మళ్ళీ పేద ప్రజలకు కేంద్రం అవే బియ్యం రేషన్‌పై ఇస్తుంది. తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ 5 కేజీల బియ్యం కేంద్రం ఇస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్నామని చెబుతున్న సన్న బియ్యంలో కూడా 60 నుంచి 65 శాతం కేంద్ర ప్రభుత్వమే ఇస్తుంది.. ఇది నిజం కాదని చెప్పగలరా..? ఉచితంగా ఒక్కొక్కరికీ 5 కేజీల బియ్యం ఇస్తున్న ఘనత మన కేంద్ర ప్రభుత్వందే. ప్రతీ రైతుకి పత్తి మీద లాభం కలిగేలా కేంద్రం చర్యలు చేపట్టింది. వడ్లతో పాటు పత్తి కూడా తెలంగాణాలో ఉత్పత్తి వస్తుందని ప్రధాని చెప్పారు. ఈ రెండు పంటల రైతులను ఆదుకోవడం ప్రభుత్వం బాధ్యత. ప్రతి చివరి కేజీ వరకు పత్తి కొనే బాధ్యత కేంద్రం తీసుకుంటుంది. రాష్ట్ర మంత్రులు ఒక్కొక్కరు ఒక్కో జిల్లాకు వెళ్ళండి. అక్కడ ఎందుకు కొనుగోలు జరగడం లేదు తెలుసుకోండి. కేవలం హైదరాబాద్ లో కూర్చొని ప్రెస్ మీట్ పెట్టడం కాదు. రైతుల సమస్యలు తెలుసుకుని



వాటిని పరిష్కరించండి. కేంద్ర ప్రభుత్వం అనేక విధాలుగా రైతులను ఆదుకుంటుంది. యూరియా 220 రూపాయలకు సబ్సిడీలో అందిస్తుంది. ఫసల్ భీమా యోజన ద్వారా దేశ రైతులకు అండగా నిలిచింది కేంద్రం. రాష్ట్ర ప్రభుత్వం కూడా రైతుల విషయంలో అండగా వ్యవహరించాలి." అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రభుత్వాన్ని నిలదీశారు.




## సర్పంచుల ఆత్మీయ భేటీ.. సమస్యలపై ప్రత్యేక చర్చ!

- రాజాపేట మండల ఫోరం ప్రెసిడెంట్ నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో సమావేశం
- గ్రామాల ప్రగతికి కలిసికట్టుగా సాగుదాం: సర్పంచులు

**తొలివెలుగు, రాజాపేట:** మండల కేంద్రంలో ఆదివారం మండల సర్పంచుల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాజాపేట మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు రంగ నరేష్ గౌడ్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో గ్రామాల్లో నెలకొన్న పలు ప్రధాన సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల పరిధిలో పెండింగ్‌లో ఉన్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించుకున్నారు. పల్లెల్లో మౌలిక వసతుల కల్పన, రాబోయే వర్షాకాలం దృష్ట్యా చేపట్టాల్సిన పారిశుధ్య చర్యలు, ఎదురవుతున్న పరిపాలనాపరమైన ఇబ్బందులను ఈ సందర్భంగా ఒకరికొకరు పంచుకున్నారు. స్థానిక సంస్థల బలోపేతానికి సర్పంచులంతా ఏకతాటిపైకి వచ్చి సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాజాపేట మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ పరిధిలోని సమస్యలను ఫోరం దృష్టికి తీసుకువచ్చారు.

## ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు వినతి

- యూత్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరిన బొందుగుల యువత
- సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే.. త్వరలోనే నిధుల హామీ



**తొలివెలుగు, రాజాపేట:** ఆలేరు శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యను ఆదివారం బొందుగుల గ్రామ బీరప్ప యూత్ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. రాజాపేట మండల పరిధిలోని బొందుగుల గ్రామంలో యువతకు సంబంధించిన వివిధ సమస్యలను వివరిస్తూ విప్ బీర్ల ఐలయ్యకు ఒక వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా యువజన సంఘం తరపున నూతనంగా నిర్మించ తలపెట్టిన యూత్ భవన నిర్మాణానికి, అలాగే అసోసియేషన్ సర్వతోముఖాభివృద్ధికి అవసరమైన నిధులను మంజూరు చేయాలని వారు ఎమ్మెల్యేను కోరారు. దీనికి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సానుకూలంగా స్పందించారు. గ్రామీణ ప్రాంతాల్లో యువత సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని, యువజన భవన నిర్మాణానికి అవసరమైన నిధులను త్వరలోనే ప్రభుత్వం తరపున మంజూరు చేస్తామని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బొందుగుల బీరప్ప యూత్ కమిటీ అధ్యక్షులు జెట్ట శ్రీకాంత్, ఉపాధ్యక్షులు బాల్దా శ్రీకాంత్, కోశాధికారి మర్ల కర్ణాకర్, యూత్ సభ్యులు బాల్దా కర్ణాకర్, జెట్ట సురేష్, గవ్వల ఉపేందర్, 3వ వార్డు సభ్యులు మర్ల రమేష్, కురుమ సంఘం అధ్యక్షులు బండ ఆంజనేయులు, ఉపాధ్యక్షులు మర్ల సమ్మయ్య, కురుమ సంఘం మాజీ అధ్యక్షులు మాపు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన పాల వెంకటేష్ గౌడ్

- జన్మదినం సందర్భంగా మర్యాదపూర్వక భేటీ
- శుభాకాంక్షలు తెలిపిన సీఎం.. ఆసుపత్రుల్లో రోగులకు పండ్ల పంపిణీ

**తొలివెలుగు, రాజాపేట:** మండల పరిధిలోని పారుపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త పాల వెంకటేష్ గౌడ్ ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. తన పుట్టినరోజును పురస్కరించుకుని హైదరాబాద్‌లో ముఖ్యమంత్రిని కలిసి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేష్ గౌడ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి, భవిష్యత్తులో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. మరోవైపు తన జన్మదినాన్ని పురస్కరించుకుని వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహించారు. హైదరాబాద్‌లోని మల్లాపూర్ పరిధిలో గల వివిధ ఆసుపత్రులను ఆయన సందర్శించారు. అక్కడ చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి, వారికి పండ్లు పంపిణీ చేశారు. సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ తమ పుట్టినరోజున ఇటువంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని స్థానికులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పారుపల్లి గ్రామానికి చెందిన పలువురు యువకులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.



# పెట్రో మోత.. ప్రజలపై పెనుభారం




- ఎన్నికల కాగానే ధరల పెంపా?: సీపీఎం జిల్లా కమిటీ ఆగ్రహం
- తక్షణమే ధరల పెంపును ఉపసంహరించుకోవాలని డిమాండ్

**తొలివెలుగు, చౌటుప్పల్:** కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలను విపరీతంగా పెంచుతూ సామాన్య, మధ్యతరగతి ప్రజలపై పెనుభారం మోపుతోందని సీపీఎం యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ సభ్యులు తీవ్రంగా మండిపడ్డారు. ఆదివారం చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని స్థానిక బస్టాండ్ ఎదురుగా ఉన్న పెట్రోల్ బంక్ సమీపంలో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎండి పాషా, గంగాదేవి సైదులు, గోశిక కరుణాకర్ మాట్లాడుతూ.. ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగియగానే కేంద్ర ప్రభుత్వం పెట్రోలియం ఉత్పత్తుల ధరలను పెంచి సామాన్య ఓటర్లను మరోసారి వంచించిందని విమర్శించారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన కేవలం పది రోజుల్లోనే లీటరు పెట్రోల్, డీజిల్‌పై 3 రూపాయలకు పైగా భారం మోపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధాన్ని సాకుగా చూపిస్తూ ఇష్టారాజ్యంగా రేట్లు పెంచడం వల్ల రవాణా ఖర్చులు పెరిగి, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతాయని, తద్వారా సామాన్యుల నడ్డి విరుస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆకుల ధర్మయ్య, బత్తుల దాసు, కొండే శ్రీశైలం, బోయ యాదయ్య, తొర్పునూరి మల్లేశం, కందగట్ల ఆనంద్, భావండ్లపల్లి స్వామి, యాట బాలరాజు, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, ఎండి రహీం, మానే శాలయ్య, భీమగొని బాలరాజు, యాట ముత్యాలు, వల్లూరి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## రేణికుంటలో ఇంటింటికీ పాలకవర్గం.. సమస్యల గుర్తింపు

- ఆదర్శంగా నిలుస్తున్న సర్పంచ్ కర్రె వెంకటేశం బృందం
- మేనిఫెస్టో హామీల అమలు.. 27 అంశాలతో ప్రత్యేక సర్వే
- గ్రామ ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించిన జిల్లా అధికార యంత్రాంగం






**తొలివెలుగు, రాజాపేట:** స్థానిక సంస్థల పరిపాలనలో రాజాపేట మండల పరిధిలోని రేణికుంట గ్రామ పంచాయతీ జిల్లాలోనే ఆదర్శంగా నిలుస్తోంది. సర్పంచ్ కర్రె వెంకటేశం నేతృత్వంలోని పాలకవర్గం ఎన్నికల మరుసటి రోజు నుంచే పల్లె ప్రగతికి వినూత్నంగా శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ సూచనలకు అనుగుణంగా నడుస్తూనే, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలుకు ముందడుగు వేస్తోంది. ఇందులో భాగంగా 27 ప్రధాన అంశాలతో కూడిన ఒక ప్రత్యేక చార్ట్‌ను సిద్ధం చేసి, గ్రామంలోని సుమారు 500 ఇళ్లలో ఇంటింటి సర్వేను చేపట్టింది. పంచాయతీ కార్యదర్శి, ఉపసర్పంచి, వార్డు సభ్యులతో కూడిన ప్రత్యేక బృందం ప్రతి గడపకూ వెళ్లి ప్రజల బాగోగులను, స్థానిక సమస్యలను నమోదు చేసుకుంటోంది. గ్రామంలోని సుమారు 2,200 జనాభాకు కనీస అవసరాలైన తాగునీరు, వీధి దీపాలు, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఆరా తీస్తున్నారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని అడిగి తెలుసుకుంటున్నారు. ఎన్నికల హామీ ప్రకారం.. గ్రామంలో ఆడపిల్ల పుడితే రూ. 5,000 నగదు డిపాజిట్ చేసే పథకాన్ని ఇప్పటికే అమలు చేసి ప్రశంసలు అందుకున్నారు. గ్రామంలో ప్రధాన సమస్యలుగా మారిన కోతులు, కుక్కల బెడదను నివారించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. సుమారు 700 కోతులను బంధించి మెదక్ అటవీ ప్రాంతంలో, 100 వరకు వీధి కుక్కలను పట్టుకుని సుదూర ప్రాంతాలలో వదిలిపెట్టారు. గ్రామ పరిపాలన కోసం పాలకవర్గం ప్రత్యేక కమ్యూనికేషన్ గ్రూపును ఏర్పాటు చేసుకొని ఎప్పటికప్పుడు చర్చించుకోవడం విశేషం. రేణికుంట పాలకవర్గం పనితీరును గమనించిన జిల్లా ఉన్నతాధికారుల బృందం గ్రామంపై ప్రత్యేక దృష్టి సారించి అభినందనలు తెలిపింది. ఈ ఆదర్శ పాలకవర్గానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తే మరిన్ని వినూత్న అభివృద్ధి పనులు వేగవంతం అవుతాయని గ్రామస్తులు కోరుతున్నారు.



సర్పంచ్ కర్రె వెంకటేశం

## బొందుగులలో ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

- 2006-07 ఎస్ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ కలయిక
- గురువులను సన్మానించి ఆశీర్వాదాలు పొందిన పూర్వ విద్యార్థులు
- తీపి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ సందడి



**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండలం బొందుగుల గ్రామంలోని ఉన్నత పాఠశాలలో 2006-07 ఎస్ఎస్‌సీ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఆత్మీయ వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. చాలా కాలం తర్వాత ఒకేచోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఆనందోత్సాహాల మధ్య తమ విద్యార్థి దశ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ప్రత్యేకంగా ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. గురువుల ఆశీర్వాదాలు తీసుకుంటూ పాఠశాల రోజుల అనుభవాలను, అప్పటి సంఘటనలను పరస్పరం పంచుకున్నారు. పాత స్నేహితులను కలుసుకోవడంతో పూర్వ విద్యార్థుల్లో ఆనందం వెల్లివిరిసింది. తాము చదువుకున్న పాఠశాలను మరోసారి సందర్శించిన పూర్వ విద్యార్థులు భావోద్వేగానికి గురయ్యారు. పాఠశాల ప్రాంగణంలో కలిసి ఫోటోలు దిగుతూ సందడి చేశారు. అనంతరం సామూహిక భోజనాలు నిర్వహించి ఉదయం నుంచి సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు. ఈ సమ్మేళనం పూర్వ విద్యార్థుల మధ్య స్నేహబంధాలను మరింత బలోపేతం చేసిందని పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు.

## రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి: ట్రాఫిక్ సీఐ విజయమోహన్

- పంతంగి టోల్‌గేట్ వద్ద వాహనదారులకు అవగాహన సదస్సు
- హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించడం తప్పనిసరి

**తొలివెలుగు, చౌటుప్పల్:** వాహనాలు నడిపే సమయంలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని చౌటుప్పల్ ట్రాఫిక్ సీఐ విజయమోహన్ సూచించారు. ఆదివారం చౌటుప్పల్ మండల పరిధిలోని పంతంగి టోల్‌గేట్ వద్ద వాహనదారులకు రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రయాణాల్లో స్వీయ రక్షణే అత్యంత ప్రధానమైనదని పేర్కొన్నారు. చాలావరకు ప్రమాదాలు రోడ్డు భద్రతా నియమాలను పాటించకపోవడం వల్లే జరుగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వంటి చర్యలు ప్రాణాంతకమని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లలో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ట్రాఫిక్ నిబంధనలను గౌరవించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బందితో పాటు అధిక సంఖ్యలో వాహనదారులు పాల్గొన్నారు.





## బోగారం గ్రామ యూత్ కాంగ్రెస్ నూతన కమిటీ ఎన్నిక

- యూత్ అధ్యక్షుడిగా చిరబోయిన నవీన్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గోగు సురేష్ యాదవ్
- గంపల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ప్రకటన
- పార్టీ బలోపేతానికి యువత కృషి చేయాలని పిలుపు

**తొలివెలుగు, రామన్నపేట:** రాష్ట్ర యూత్ కాంగ్రెస్ పిలుపులో భాగంగా రామన్నపేట మండల పరిధిలోని బోగారం గ్రామంలో నూతన గ్రామ యూత్ కాంగ్రెస్ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గంపల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రత్యేక సమావేశంలో నూతన కార్యవర్గాన్ని అధికారికంగా ప్రకటించారు. గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా చిరబోయిన నవీన్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గోగు సురేష్ యాదవ్, ఉపాధ్యక్షులుగా గుంతకండ్ల నవీన్ రెడ్డి, బొడ్డేపల్లి శివప్రసాద్‌లను ఎన్నుకున్నారు. అలాగే ప్రధాన కార్యదర్శులుగా జిల్లా సుధీర్ కుమార్, కనుకు మల్లేష్, అంతటి శివ, మేడి సాయిబాబా.. సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా నేరటి మనీ యాదవ్ ఎంపికయ్యారు. కార్యదర్శులుగా కందగట్ల భాస్కర్, నాయని మల్లేష్, మేడి మచ్చగిరి, కోశాధికారిగా రాపోల్ అశోక్ నియమితులయ్యారు. కార్యవర్గ సభ్యులుగా కడారి గణేష్, సాయి, గోగు వంశీ, గుంతకండ్ల గణేష్ రెడ్డిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గంపల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో యువత కీలక పాత్ర పోషించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మధ్యపురి ఐలయ్య, నాయకులు గోగు సత్తయ్య, గోగు హరిప్రసాద్, యూత్ మండల్ నాయకులు కందగడ్డ రాహుల్, గుంతకండ్ల గోవర్ధన్ రెడ్డి, సీనియర్లు గంపల జీవన్ రెడ్డి, గంపల గోపాల్ రెడ్డి, జిల్లా దత్తాద్రి, కందగట్ల ఆదినారాయణ, గోగు కిష్టయ్య, వనం కిష్టయ్య, బొడిపల్లి లింగయ్య, ఎన్ఎస్‌యూఐ గ్రామ ప్రెసిడెంట్ కనుక రాము, గుర్రం లక్ష్మణ్, మేడి నరసింహ, నేరటి మల్లేష్, ఆమనగంటి ధనుంజయ, బోడ పరుశురాం, బొడ్డుపల్లి హరి ప్రసాద్, భోగ బన్నీ, మెట్టు నాని, బొడ్డుపల్లి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులను గందరగోళానికి గురిచేస్తే సహించేది లేదు

- ప్రతిపక్షాల తీరుపై డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిమ్మాపురం మహేందర్ రెడ్డి ధ్వజం
- సహకరించాల్సింది పోయి.. బద్నాం చేయడానికి కుట్రలు
- ఎమ్మెల్యే వేముల వీరేశం పర్యవేక్షణలో సాఫీగా కొనుగోళ్లు
- 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లోకి నిధుల జమ



**తొలివెలుగు, రామన్నపేట:** రామన్నపేట మండలం ఇంద్రపాలనగరం గ్రామంలో వడ్ల కొనుగోళ్ల వ్యవహారంలో ప్రతిపక్ష పార్టీల నాయకులు రాజకీయ లబ్ధి కోసం ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చేలా వ్యవహరిస్తున్నారని యాదాద్రి భువనగిరి జిల్లా డీసీసీ ప్రధాన కార్యదర్శి తిమ్మాపురం మహేందర్ రెడ్డి విమర్శించారు. ఆదివారం ఆయన రామన్నపేటలో విలేకరులతో మాట్లాడారు. నకిరేకల్ నియోజకవర్గ శాసనసభ్యులు వేముల వీరేశం ఎప్పటికప్పుడు ఐకేపీ, పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను స్వయంగా సందర్శిస్తూ, రైతులకు అందుతున్న మౌలిక వసతులు, ధాన్యం రవాణా ప్రక్రియను అధికారులతో సమీక్షిస్తున్నారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల శ్రేయస్సుకు కట్టుబడి ఉందన్న ఆయన.. ధాన్యం విక్రయించిన 48 గంటల వ్యవధిలోనే నిధులను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తోందని స్పష్టం చేశారు. మండలంలో మరెక్కడా లేని విధంగా కేవలం ఇంద్రపాలనగరంలోనే రాస్తారోకోలు, ధర్నాల పేరిట అలజడులు సృష్టించడం వెనుక ఉన్న రాజకీయ కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. గ్రామంలో రైతుల ఇబ్బందులను నివారించాల్సింది పోయి, స్థానిక సర్పంచ్, బీఆర్ఎస్ నాయకులు అధికారులకు సహకరించకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే వేముల వీరేశంను, కాంగ్రెస్ శ్రేణులను బద్నాం చేయడమే ధ్యేయంగా పెట్టుకున్నారని, ఇకపై రైతులను గందరగోళానికి గురిచేస్తూ కొనుగోళ్లకు ఇబ్బంది కలిగిస్తే ఊరుకునేది లేదని, చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయని మహేందర్ రెడ్డి హెచ్చరించారు.

## అనారోగ్యంతో వ్యక్తి మృతి: బాధితులకు సర్పంచ్ ఆర్థిక సాయం

- ధర్మారెడ్డిపల్లిలో రాజన్న శివరాజు కుటుంబానికి పరామర్శ
- రూ. 10 వేల నగదు అందజేత

**తొలివెలుగు, చౌటుప్పల్/భూదాన్ పోచంపల్లి:** మండల పరిధిలోని ధర్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన రాజన్న శివరాజు (45), అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ సామ రవీందర్ రెడ్డి ఆదివారం మృతుడి నివాసానికి వెళ్లి ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శోకతప్త హృదయంతో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆపదలో ఉన్న ఆ కుటుంబానికి అండగా నిలుస్తూ సర్పంచ్ సామ రవీందర్ రెడ్డి తన సొంత నిధుల నుండి రూ. 10,000 ఆర్థిక సహాయాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. నిరుపేద కుటుంబాలకు ఇటువంటి కష్ట సమయాల్లో అండగా నిలవడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొమిరి కిరణ్, మాజీ ఉప సర్పంచ్ సురవి కాటంరాజు, గ్రామ నాయకులు సామ జంగారెడ్డి, కాటపల్లి బచ్చయ్య గౌడ్, కళ్లెం జంగారెడ్డి, కొమ్మిరి యాదయ్య, ఎడ్ల సహోదవ్, అవనిగంటి రమేష్, మధు తదితరులు పాల్గొన్నారు.



# రెండు నెలలైనా అందని కొనుగోళ్లు: మార్కెట్ యార్డుకు రైతుల తాళం

- స్థానిక ధాన్యం వదిలి.. ఇతర ప్రాంతాల వడ్ల తూకాలు
- అధికారుల నిర్లక్ష్యమా.. ప్రభుత్వ వైఫల్యమా?: బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్
- ఆత్మకూరు (ఎం)లో అధికారుల తీరుపై బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్ మండిపాటు
- ఆందోళనకు దిగిన 130 మంది అన్నదాతలు



**తొలివెలుగు, ఆత్మకూరు(ఎం):** స్థానిక మార్కెట్ యార్డులో ధాన్యం పోసి రెండు నెలలు గడుస్తున్నా అధికారులు కొనుగోలు ప్రక్రియను ప్రారంభించకపోవడాన్ని నిరసిస్తూ ఆత్మకూరు గ్రామ రైతులు ఆదివారం మార్కెట్ యార్డు ప్రధాన ద్వారానికి తాళం వేసి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్ మాట్లాడుతూ.. ఆత్మకూరు గ్రామానికి చెందిన సుమారు 130 మంది రైతులు తమ ధాన్యాన్ని మార్కెట్ యార్డుకు తీసుకొచ్చారని తెలిపారు. అయితే, అధికారులు ఇప్పటివరకు కేవలం 30 మంది రైతులకు సంబంధించిన ధాన్యాన్ని మాత్రమే తూకం వేశారని, మిగిలిన 100 మంది రైతుల వడ్లను అలాగే వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక రైతుల పరిస్థితి ఇలా ఉంటే.. అధికారులు, మిల్లర్లు కుమ్మక్కై ఇతర గ్రామాల నుంచి, రైస్ మిల్లల నుంచి వస్తున్న వడ్లను మాత్రం యథేచ్ఛగా ఇదే మార్కెట్ యార్డులో తూకం వేస్తున్నారని ఆరోపించారు. స్థానిక అన్నదాతలను ఇబ్బందులకు గురిచేయడం అధికారుల నిర్లక్ష్యమా లేక ప్రభుత్వ వైఫల్యమా అని ఆమే ప్రశ్నించారు. రెండు నెలలుగా ఎండకు ఎండుతూ, వానకు నానుతూ ధాన్యం కుప్పల వద్దే కాపలా ఉంటున్నా కొనుగోలు చేయకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి స్థానిక రైతుల ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు కోరే బిక్షపతి, మోహన్ రెడ్డి, మాద శ్రీను, బండారు సత్యనారాయణ, లోడి వెంకటయ్య, నాది రాజు గౌడ్, మజ్జిగ రాంబాబు, మాద రమేష్, యాస వెంకట్ రెడ్డి, పంజాల సందీప్, పంజాల రాజు పాల్గొన్నారు.

## 'చలో ఉస్మానియా క్యాంపస్'.. భారీగా తరలిన శాలివాహనులు

- రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి పోచంపల్లి మండల శ్రేణుల ప్రయాణం
- పట్టణంలో వంగూరి పెంటయ్య, రాజు ఆధ్వర్యంలో ర్యాలీ

**తొలివెలుగు, చౌటుప్పల్/భూదాన్ పోచంపల్లి:** హైదరాబాదులోని ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ) క్యాంపస్‌లో నిర్వహించనున్న రాష్ట్ర కుమ్మరి సంఘం కార్యవర్గ సమావేశానికి భూదాన్ పోచంపల్లి మండల శ్రేణులు ఆదివారం భారీగా తరలివెళ్లాయి. మండల కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో 'చలో ఉస్మానియా క్యాంపస్' కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పోచంపల్లి మండల అధ్యక్షుడు వంగూరి పెంటయ్య, జిల్లా గౌరవ అధ్యక్షుడు వంగూరి రాజు సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలో ముందుగా ఒక ప్రదర్శన (ర్యాలీ) నిర్వహించారు. శాలివాహనుల ఐక్యతను చాటుతూ నినాదాలు చేశారు. అనంతరం వారు ప్రత్యేక వాహనాల్లో ఉస్మానియా క్యాంపస్‌కు ప్రయాణమయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. శాలివాహన సమాజ సామాజిక, రాజకీయ, ఆర్థిక హక్కుల సాధన కోసం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు తరలివెళ్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం పట్టణ అధ్యక్షుడు సైదులు, మండల ప్రధాన కార్యదర్శి చిలువేరు బాల నరసింహ, యువజన సంఘం మండల అధ్యక్షుడు వంగూరి పాండు, మీడియా విభాగం అధ్యక్షుడు వంగూరి క్రాంతికుమార్, ఉద్యోగ విభాగం అధ్యక్షుడు చిలువేరు శేఖర్ పాల్గొన్నారు. అలాగే ముఖ్య నాయకులు చిలువేరు నరసింహ, గంగదారి లక్ష్మణ్, వంగూరు బాలయ్య, పాండు, రమేష్, బాలరాజు, శేఖర్, అంజయ్య, శివశంకర్, రాము, బళ్లారి రాజ్ కుమార్, బళ్లారి బిక్షపతి, భూషణ్, శనిగారం ఇస్తారి, గుండాల వెంకటేశం, నడికుడి దాసు, వీరయ్య, రాములు, గోస్కొండ రాజు, శంకరయ్య, బాలయ్య తదితరులు క్యాంపస్‌కు తరలివెళ్లిన వారిలో ఉన్నారు.






## రామన్నపేట డిగ్రీ కళాశాలలో ముగిసిన విద్యా వారోత్సవాలు

- జాతీయ, రాష్ట్రస్థాయి ప్రతిభావంతులకు, పాత్రికేయులకు ఘన సన్మానం
- కళాశాల కీర్తిని పెంచిన విద్యార్థులు: ప్రిన్సిపల్ ఆచార్య రాహత్ ఖానం

**తొలివెలుగు, రామన్నపేట:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా గత వారం రోజులుగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ముగింపు వేడుకలను పురస్కరించుకుని విద్యార్థులు ప్రదర్శించిన సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా వివిధ రంగాలలో జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో పాటు, సమాజంలో గురుతర బాధ్యత పోషిస్తున్న పత్రికా విలేకరులను కళాశాల తరఫున ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య రాహత్ ఖానం మాట్లాడుతూ.. వారం రోజులుగా విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేలా ఈ ఉత్సవాలు సాగాయన్నారు. క్రీడలు, సాంస్కృతిక రంగాలు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విభాగాల్లో జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో విద్యార్థులు రాణించి కళాశాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడం గర్వకారణమన్నారు. అలాగే కళాశాల ప్రగతిని, విద్యార్థుల విజయాలను తమ లేఖిని ద్వారా సమాజానికి చేరవేస్తున్న విలేకరుల పాత్ర ఎంతో ప్రశంసనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీ నీలిమ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి. వెంకటేశ్వరరావు, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ జె. చిన్నబాబు, పరిపాలనాధికారి జి. కరుణాకర్, సభ్యులు డాక్టర్ రత్న మంజుల, రాధిక, అధ్యాపకులు డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య, డాక్టర్ సిహెచ్. వెంకట్ గౌడ్, డాక్టర్ డి. కిషన్, డాక్టర్ పి. బ్రహ్మం, డాక్టర్ ఎం. రవీందర్ రావు, డాక్టర్ రాచమళ్ళ శ్రీను, టి. శ్రీనివాస్, జె. నరేశ్, రవి, కార్యాలయ సిబ్బంది శ్రీదేవి, నాగరాజు, నవీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

## పాతికేళ్ల నాటి 'ఉజ్వల' దోస్తీ.. వలిగొండలో సందడి!

- ఒకే చోటకు చేరిన నాటి టెన్త్ క్లాస్ స్నేహితులు
- తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్న 2000-01 బ్యాచ్ పూర్వ విద్యార్థులు
- గురువులకు ఘన సత్కారం.. ఆశీస్సులు తీసుకున్న శిష్యులు



**తొలివెలుగు, వలిగొండ:** స్థానిక ఉజ్వల ఉన్నత పాఠశాలలో 2000-2001 విద్యాసంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం మండల కేంద్రంలోని శివ సాయి ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. చదువు పూర్తి చేసుకుని సుమారు 25 ఏళ్లు (రజతోత్సవ తరుణం) గడిచిన సందర్భంగా నాటి మిత్రులంతా ఒకే వేదికపైకి చేరి బాల్య స్మృతులను నెమరువేసుకున్నారు. ఈ ఆత్మీయ కలయికకు నాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు బందారపు లింగస్వామి, దంతూరి సత్తయ్య, భీమిడి యాదిరెడ్డిలను పూర్వ విద్యార్థులు సాదరంగా ఆహ్వానించారు. తమ జీవితాల్లో ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి పునాది వేసిన ఉపాధ్యాయులను శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు చాటుకున్నారు. గురువులు సైతం తమ పూర్వ విద్యార్థుల ఎదుగుదలను చూసి మురిసిపోతూ, వారి భవిష్యత్తుకు ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. జీవితంలో స్నేహం అనేది మరపురాని తీపి జ్ఞాపకమని, ఇన్నేళ్ల తర్వాత చిన్ననాటి దోస్తులను కలుసుకోవడం తమ అదృష్టమని ఆనందం వ్యక్తం చేశారు. తమనందరినీ ఒకే వేదికపైకి తీసుకురావడానికి ప్రత్యేకంగా కృషి చేసిన తోటి మిత్రులు కౌడే మల్లేశం, కొండూరు ధనుంజయ, సోలిపురం దయాకర్ రెడ్డి, ఏనుగు సిద్ధారెడ్డి, మిట్టపల్లి మహేష్, పాశం సంతోష్ రెడ్డిలకు స్నేహితుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఉదయం నుండి సాయంత్రం వరకు సాగిన ఈ వేడుకల్లో పూర్వ విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొని ఉత్సాహంగా గడిపారు.

# పల్లెల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు!

- జన్నారం మండలంలో నిబంధనలు నవ్వులపాలు
- గడపగడపకూ చేరుతున్న మద్యం.. ఊరికో 'అలిఖిత' బార్ అండ్ రెస్టారెంట్
- మామూళ్ల మత్తులో అధికారులు.. యాథేచ్ఛగా బెల్ట్ షాపుల దందా
- హోటళ్లు, ఇళ్లలోనే మద్యం విక్రయాలు
- ఎక్సైజ్, పోలీస్ అధికారుల నిర్లక్ష్యంపై గ్రామస్తుల ఆగ్రహం
- ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన శూన్యం: గ్రామస్తుల ఆవేదన




**తొలివెలుగు, జన్నారం:** మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని గ్రామీణ ప్రాంతాలు అక్రమ మద్యానికి నిలయాలుగా మారుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ పల్లెల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు వెలుస్తుండటంపై స్థానిక ప్రజల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. మండల పరిధిలోని దాదాపు ప్రతి గ్రామంలోనూ యాథేచ్ఛగా ఐదు నుంచి ఆరు బెల్ట్ షాపులు నడుస్తున్నాయంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. కిరాణా దుకాణాలు, హోటళ్లు, చివరికి నివాస గృహాల వేదికగా ఈ అక్రమ మద్యం విక్రయాలు సాగుతున్నా ఎక్సైజ్, పోలీస్ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

**మద్యం ఏరులై పారుతున్న పల్లెలు:**

స్థానిక వైన్ షాపుల నిర్వాహకులు తమ లాభాల కోసం గ్రామాల్లో ప్రత్యేక ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని విచ్చలవిడిగా మద్యాన్ని సరఫరా చేస్తున్నట్లు సమాచారం. పగలు, రాత్రి అనే తేడా లేకుండా నిరంతరాయంగా మద్యం అమ్మకాలు సాగుతుండటంతో, గ్రామీణ ప్రాంతాల్లోని యువత, విద్యార్థులు మద్యానికి బానిసలై తమ భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**శాంతిభద్రతలకు విఘాతం.. కుటుంబాలు చిన్నాభిన్నం:**

సాయంత్రం అయిందంటే చాలు మద్యం బాబుల గొడవలతో గ్రామాల్లో భయాందోళన వాతావరణం నెలకొంటోందని మహిళలు వాపోతున్నారు. "ఊరికి తాగునీరు అందుతుందో లేదో తెలియదు కానీ.. మద్యం మాత్రం 24 గంటలూ అందుబాటులో ఉంది" అంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, కూలీనాలీ చేసుకునే పేద కుటుంబాల సంపాదన అంతా ఈ అక్రమ మద్యానికే హారతి అవుతోందని, దీనివల్ల అనేక కుటుంబాలు ఆర్థికంగా కుంగిపోతున్నాయని మహిళా సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఉదయాన్నే మద్యానికి అలవాటు పడుతున్న యువత భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని సామాజిక కార్యకర్తలు హెచ్చరిస్తున్నారు.

### ఫిర్యాదులు చేసినా స్పందన కరువు:

**ఈ అక్రమ వ్యాపారంపై పలుమార్లు పోలీస్, ఎక్సైజ్ అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కొందరు అధికారులు మామూళ్ల మత్తులో మునిగితేలుతూ చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు కూడా బలంగా వినిపిస్తున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, జన్నారం మండలంలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి బెల్ట్ షాపులను పూర్తిగా రద్దు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సమస్య ఇలాగే కొనసాగితే మహిళలు, యువతతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టి ఎక్సైజ్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరిస్తున్నారు.**

# ఎండల వేళ.. చల్లని 'తాటి' వనసోరస!

- చౌటుప్పల్‌లో దాహార్తి తీరుస్తున్న చలివేంద్రం
- స్మరణీయుడు రామచంద్రం.. తండ్రి బాటలో కుమారుడు వెంకటేశం
- పోలీసులు, ప్రయాణికులకు దొరికిన పెద్ద ఉపశమనం



**తొలివెలుగు, చౌటుప్పల్:** మునుపెన్నడూ లేని విధంగా ఈ ఏడాది వేసవి ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరుగుతున్న తరుణంలో, చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రం ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతోంది. చౌటుప్పల్ బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ దివంగత కాంగ్రెస్ నేత తాటి రామచంద్రం స్మారకార్థం ఆయన కుమారుడు తాటి వెంకటేశం ఈ సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

ఈ చలివేంద్రంలో నిర్వాహకుడిగా వ్యవహరిస్తున్న బోదుల శంకరయ్య ప్రతిరోజూ ఉదయం నుండి సాయంత్రం వరకు నిరంతరాయంగా చల్లటి తాగునీటిని సరఫరా చేస్తున్నారు. బస్టాండ్‌కు వచ్చే వివిధ ప్రాంతాల ప్రయాణికులతో పాటు దారిపొడవునా వెళ్లే ప్రజలు, పాదచారులు ఇక్కడికి వచ్చి తమ దాహార్తిని తీర్చుకుంటున్నారు. తీవ్రమైన ఎండ దెబ్బకు అల్లాడిపోతున్న సర్వసాధారణ ప్రజలతో పాటు, నిరంతరం ఎండలోనే విధుల్లో కొనసాగుతున్న స్థానిక పోలీస్ సిబ్బంది సైతం ఈ చలివేంద్రం నీటిని తాగి ఉపశమనం పొందుతున్నారు. ఎండ తీవ్రతను, ప్రజల అవసరాలను గుర్తించి వేసవి కాలంలో ఇలాంటి స్వచ్ఛంద సామాజిక సేవా కార్యక్రమం చేపట్టడం పట్ల స్థానికులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తూ నిర్వాహకులను అభినందిస్తున్నారు.

# భగీరథ్ ఫోన్ డాటా డిలీట్!

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పోక్సో కేసులో నిందితుడు బండి భగీరథ్ వాడిన అత్యాధునిక ఐఫోన్‌లోని డాటాను, కీలక వీడియోలను డిలీట్ చేసినట్టు పోలీసులు గుర్తించినట్టు తెలిసింది. అతను తన సోషల్ మీడియా అకౌంట్లను మాయం చేసినట్టు నిర్ధారించినట్టు సమాచారం. ఈ నెల 8న బండి భగీరథ్‌పై పేట్‌బషీరాబాగ్‌లో కేసు నమోదు కాగానే నిందితుడి సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ అయినట్లు పోలీసులు గుర్తించారు. బండి భగీరథ్‌పై కేసు నమోదు నాటి నుంచి అరెస్ట్ వరకు హైడ్రామా, సాక్ష్యాల ధ్వంసానికి పాల్పడినట్టు ఇప్పటికే ఆరోపణలు రావడంతో, పోలీసులు కేసుకు సంబంధించిన కీలక సాక్ష్యాలను బయటకు తీస్తున్నట్టు సమాచారం.తెలంగాణ సమాచారం ఈ కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు ఇప్పుడు ఆధునిక టెక్నాలజీ అస్త్రాన్ని ప్రయోగించనున్నట్టు సమాచారం. నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు.. ఆ వెంటనే అతడి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. తను వాడిన ఐఫోన్‌లోని డేటాను, కీలక వీడియోలను డిలీట్ చేయడం, సోషల్‌మీడియా అకౌంట్లను మాయంచేసి చట్టం నుంచి తప్పించుకోవచ్చని నిందితుడు భావించినట్టు పోలీసులు గుర్తించారని తెలిసింది. ఇందులో భాగంగానే ఫోన్‌ను పలుమార్లు ఫార్మాట్ చేసినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. కానీ నిందితుడు ఎంత తెలివిగా సాక్ష్యాలను తారుమారు చేసినా అంతకంటే వంద రెట్లు పవర్‌ఫుల్ టెక్నాలజీతో పోలీసులు ఉచ్చు బిగించేందుకు సన్నాహాలు ఇప్పటికే మొదలు పెట్టినట్టు తెలిసింది. ఈ కేసులో కీలక సాక్ష్యాలు సేకరించేందుకు పోలీసులకు నిందితుడి ఫోన్ కీలకంగా మారింది. పోక్సో కేసు నిందితుడు బండి భగీరథ్ ఫోన్ స్విచ్ఛాఫ్ కావడానికి ముందు ఎక్కడున్నాడు? ఎవరితో మాట్లాడాడు? చట్టం నుంచి అతనికి ఆశ్రయం కల్పించింది ఎవరు? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నట్టు సమాచారం. ఆ వివరాల కోసం సెల్‌టవర్ మ్యాపింగ్, కాల్‌డాటా రికార్డులను పోలీసులు సేకరిస్తున్నట్టు తెలిసింది. సాక్ష్యాలను నాశనం చేయడంలో నిందితుడికి సహకరించిన తెరవెనుక సూత్రధారులను కూడా ఈ మ్యాపింగ్ ద్వారా వెలుగులోకి తెచ్చేందుకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిసింది.

**డిలీట్ అయిన డాటా రిట్రీవ్!**

ఐఫోన్‌లో సెక్యూరిటీ ఫీచర్లు అత్యంత కఠినంగా ఉంటాయి. అందుకే నిందితులు ఐఫోన్‌లో డాటాను డిలీట్ చేస్తే పోలీసులు ఏమి చేయరనే ధీమాలో ఉంటారని పోలీసులు చెప్తున్నారు, కానీ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ నిపుణుల వద్ద అత్యంత ఆధునిక సాఫ్ట్‌వేర్లు అందుబాటులో ఉండటంతో వివిధమార్గాల ద్వారా డిలీట్ అయిన డాటాను రిట్రీవ్ చేసేందుకు అవకాశాలున్నాయని పోలీస్ వర్గాలు చెప్తున్నాయి. అడ్వాన్స్‌డ్ ఫోరెన్సిక్ టూల్స్‌తో సెల్రబ్రైట్ వంటి అంతర్జాతీయ స్థాయిలో ఫోరెన్సిక్ సాఫ్ట్‌వేర్‌లు, ఐఫోన్‌లోని నంద ఫ్లాస్ మెమొరీ నుంచి డిలీట్ అయిన డాటాలోని చాటింగ్, వీడియోలు, ఫొటోలను రికవరీ చేసేందుకు తగిన మార్గాలున్నాయని పోలీసులు ధీమాతో ఉన్నారు.

ఐఫోన్‌లోని అంతర్గత మెమొరీని నిందితుడు పూర్తిగా ఫ్యాక్టరీ రీసెట్ చేసినా పోలీసులు వదిలిపెట్టే ప్రసక్తేలేదని, ఐ క్లౌడ్‌లో బ్యాకప్ నుంచి కూడా డాటాను తిరిగి తీయొచ్చని చెప్తున్నారు. అవసరమైతే నిందితుడి క్లౌడ్ అకౌంట్ యాక్సెస్ కోసం కోర్టు ద్వారా యాపిల్ సంస్థను సంప్రదించేందుకూ సిద్ధమవుతున్నట్టు సమాచారం. ఐక్లౌడ్ సర్వర్ల నుంచి నిందితుడికి సంబంధించిన ప్రతి డిజిటల్ ఆధారం డిలీట్ అయినా వాట్సాప్ బ్యాకప్‌లను, సోషల్‌మీడియా చాట్లను తిరిగి రాబట్టే అవకాశాలు కూడా లేకపోలేదని నిపుణులు పేర్కొంటున్నారు. సోషల్‌మీడియా అకౌంట్లను డిలీట్ చేసినా, వాటి సర్వర్ల నుంచి డాటాను సేకరించేందుకు సైతం పోలీసులు సిద్ధమవుతున్నారు.

**రిసీవ్డ్ డాటా సైతం!**

ఒకవేళ నిందితుడి ఫోన్ నుంచి సమాచారాన్ని రాబట్టడంలో సాంకేతిక ఇబ్బందులు ఎదురైతే, ఈ కేసులో పూర్తిసాక్ష్యాలను కోర్టు ముందు నిలబెట్టేందుకు పోలీసులు ప్లాన్ 'బీ'ని కూడా అమలు చేసేందుకు సిద్ధమవున్నట్టు చర్చ జరుగుతుంది. ఈ కేసులో బాధితురాలి ఫోన్ సైతం మరో సాక్ష్యంగా మారనున్నదని పోలీస్ వర్గాలు చర్చించుకుంటున్నాయి. నిందితుడు బాధితురాలికి పంపిన బెదిరింపులు, మెసేజ్‌లు, ఫొటోలు, వీడియోలు బాధితురాలి నుంచి సేకరించి, వాటిని ధ్రువీకరించుకొని రిసీవ్డ్ డాటాలో పటిష్టమైన ప్రాథమిక సాక్ష్యాలు కోర్టు ముందు ఉంచనున్నారని తెలుస్తున్నది.



# ఇన్‌ఫ్లుయెన్సర్లపై కేసులు

**పోక్సో కేసులో బాధితురాలిపై వ్యతిరేక ప్రచారం చేశారని చర్యలు**

జగద్గిరిగుట్ట, మే17: పోక్సో కేసు నిందితుడు బండి భగీరథ్‌కు మద్దతుగా సోషల్‌మీడియాలో వీడియోలు పోస్ట్ చేసిన ఇన్‌ఫ్లుయెన్సర్లపై పోలీసులు చర్యలు ప్రారంభించారు. ఇప్పటివరకూ14 మందిపై కేసు నమోదు కాగా, మొత్తం 50మంది వీడియోలను, అభ్యంతరకర కంటెంట్‌ను పోస్ట్ చేసినట్టు గుర్తించారు. సోషల్‌మీడియాలో తమపై వ్యతిరేక ప్రచారం చేయడంతో బాధితురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ గోప్యతకు భంగం కలుగిస్తున్న సోషల్‌మీడియా ఖాతాలలో కంటెంట్ తొలగించడంతోపాటు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితురాలికి వ్యతిరేక ప్రచారంపైనా జిల్లా చైల్డ్‌వెల్ఫేర్ ప్రతినిధులు కూడా పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తప్పుడు ప్రచారంతో పోలీసులను, ప్రజలను పక్కదారి పట్టించేలా ఉన్న వీడియోలను పోలీసులు ఇప్పటికే కొన్నింటిని గుర్తించారు. అప్‌లోడ్ చేయడం, వాటిని ఉద్దేశపూర్వకంగా ఎక్కువసార్లు షేర్ చేసినవారి వివరాలను ఆరా తీశారు. పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేసిన తర్వాత నుంచి నిందితుడి అరెస్టు వరకూ.. కేసు తీవ్రత తగ్గేలా, బాధితురాలిని తప్పుబడుతూ పలువురు సోషల్‌మీడియా ఖాతాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. నిందితునికి క్లీన్ ఇమేజ్ ఉన్నట్టు చూపే ప్రయత్నంలో డబ్బులు తీసుకొని ప్రచారం చేసినట్టు అనుమానిస్తున్నారు. నిందితులకు మద్దతుగా ప్రచారం, పోక్సో బాధితుల వివరాలు వెల్లడయ్యేలా చేయడం నేరం, సోషల్‌మీడియాలో పోక్సో కేసులో వ్యతిరేక ప్రచారం చేసినవారిపై విచారణ చేసి చర్యలు తీసుకునే అవకాశం ఉన్నదని పోలీస్ అధికారులు హెచ్చరిస్తున్నారు.

# నిమ్స్ ఉద్యోగులపై పర్యవేక్షణేది!

ఖైరతాబాద్: నిమ్స్ వైద్యశాలలో వెలుగుచూసిన కిడ్నీ దందా వ్యవహారం మరిన్ని అనుమానాలకు తావిస్తున్నది. డయాలసిస్ రోగులను లక్ష్యంగా చేసుకొని కిడ్నీ ఇప్పిస్తానంటూ డబ్బులు వసూలు చేసిన ఘటనలో ఓ వార్డు బాయ్ మాత్రమే కాకుండా మరికొందరి ప్రమేయమూ ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉద్యోగులపై సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఈ వ్యవహారం కొనసాగుతున్నదన్న ఆరోపణలున్నాయి. 2023 నవంబర్‌లో నిందితుడు నాగరాజు పరిచయమైనట్లు బాధితులు చెబుతుండగా, రెండు సంవత్సరాలకు పైగానే ఈ వ్యవహారం కొనసాగుతున్నట్లు తెలుస్తున్నది. డయాలసిస్ రోగులతో వార్డులోనే సంప్రదింపులు జరుపుతూ డబ్బులు డిమాండ్ చేస్తున్నా.. విషయం యాజమాన్యం దృష్టికి వెళ్లకపోవడంపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కాంట్రాక్ట్ ఉద్యోగుల విధులను పర్యవేక్షించే బాధ్యత సూపర్‌వైజర్లపై ఉంటుంది. వార్డు బాయ్‌ల పనితీరును ఎప్పటికప్పుడు గమనించాలి. ఈ వ్యవహారం ఇంత కాలం బయటపడక పోవడంపై ఆస్పత్రి ఉద్యోగులే ఆశ్చర్యపోతున్నారు. ఈ విభాగంలోని ఉద్యగులందరినీ పర్యవేక్షించాల్సిన బాధ్యత ఓ డిప్యూటీ స్థాయి వైద్యాధికారిపై ఉంటుంది. కానీ రెండు సంవత్సరాలకు పైగా ఈ వ్యవహారం సాగుతున్నా.. పట్టించుకోకపోవడంపై పలువురు ఉద్యోగులు అనేక అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఈ వ్యవహారంలో మరెవరైనా ఆస్పత్రి సిబ్బంది ప్రమేయం ఉందా..? డబ్బుల లావాదేవీలు ఎవరెవరి ద్వారా జరిగాయి..? ఎంత మంది బాధితులు ఉన్నారు..? అనే కోణాల్లో పోలీసుల విచారిస్తున్నట్లు తెలిసింది. నిందితుడు నాగరాజును అదుపులోకి తీసుకున్న పోలీసులు.. అతడి కాల్ డేటా, ఆర్థిక లావాదేవీల వివరాలను సేకరిస్తున్నట్లు తెలిసింది. యాజమాన్యం సైతం అంతర్గత విచారణను వేగవంతం చేసినట్లు సమాచారం.

## ప్రజల సౌకర్యార్థం కంట్రోల్ రూమ్ ఏర్పాటు.. ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై కలెక్టర్ ప్రతిమా సింగ్

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం నిర్వహణలో భాగంగా ప్రజల సౌకర్యార్థం మెదక్ జిల్లాలోని మెదక్ సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయమై కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా జూన్ 15వ తేదీ నుండి 24వ తేదీ వరకు శ్రీ సన్నాహక, శిక్షణ, ముద్రణా కార్యక్రమాలు, జూన్ 25వ తేదీ నుండి జూలై 24వ తేదీ వరకు బూత్ స్థాయి అధికారుల ఇంటింటి సందర్శన, జూలై 24వ తేదీన పోలింగ్ కేంద్రాల హేతు బద్ధీకరణ, 31వ తేదీన ముసాయిదా జాబితా ప్రచురణ నిర్వహించడం జరుగుతుందన్నారు. జూలై 31వ తేదీ నుండి ఆగస్టు 30వ తేదీ వరకు ఫిర్యాదులు, అభ్యంతరాలు స్వీకరించడం జరుగుతుందని, సెప్టెంబర్ 28వ తేదీ వరకు ఫిర్యాదులు, అభ్యంతరాల పరిష్కారం ప్రక్రియ తరువాత అక్టోబర్ 1వ తేదీన తుది జాబితా ప్రచురించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో ప్రజల సౌకర్యార్థం కంట్రోల్ రూమ్ 9553866388 నెంబర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పని దినాలలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుందని, సందేహాలు, సమాచారం కొరకు కంట్రోల్ రూమ్ నం. లో సంప్రదించవచ్చని తెలిపారు.



# రూమర్లపై కౌంటర్ ఇచ్చిన మీనా



తనపై వస్తున్న అనవసర రూమర్లకు ఈసారి గట్టిగానే కౌంటర్ ఇచ్చారు సీనియర్ హీరోయిన్ మీనా. చాలా కాలం పాటు దక్షిణ భారత సినీ పరిశ్రమలో అగ్ర కథానాయికగా వెలుగొందిన మీనా, తాజాగా సోషల్ మీడియాలో ప్రచారం అవుతున్న తప్పుడు కథనాలపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఎప్పుడూ వివాదాలకు దూరంగా ఉండే మీనా, ఈసారి మాత్రం తన సహనాన్ని పరీక్షిస్తున్నారని స్పష్టంగా చెప్పుకొచ్చారు. చైల్డ్ ఆర్టిస్ట్‌గా కెరీర్ ప్రారంభించి, ఆపై హీరోయిన్‌గా స్టార్ స్టేటస్ అందుకున్న మీనా. సీతారామయ్య గారి మనవరాలు, చంటి, అబ్బాయిగారు, అల్లరి అల్లుడు, ముత్తు వంటి చిత్రాలతో ప్రేక్షకుల మనసుల్లో శాశ్వత స్థానం సంపాదించారు. ఇప్పటికీ క్యారెక్టర్ రోల్స్, కీలక పాత్రలతో తన సెకండ్ ఇన్నింగ్స్‌ను విజయవంతంగా కొనసాగిస్తున్నారు. అయితే ఇటీవల మీనా రెండో పెళ్లి చేసుకోబోతున్నారంటూ వస్తున్న కథనాలు ఆమెను తీవ్రంగా కలచివేశాయట. వ్యక్తిగత జీవితంలో ఇప్పటికే పెద్ద విషాదాన్ని ఎదుర్కొన్న మీనా, మళ్లీ ఇలాంటి అసత్య ప్రచారాలు తనను మానసికంగా బాధిస్తున్నాయని తెలిపారు. “నిజం ఏంటో తెలుసుకోకుండా, మీ ఇష్టం వచ్చినట్లు కథలు అల్లడం ఎంతవరకు కరెక్ట్ ?” అంటూ ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఒక ఒంటరి మహిళనని, అంతేకాదు ఒక కుమార్తె తల్లినని గుర్తుచేశారు.

ఈ వార్తలు తన కూతురు చూసినప్పుడు ఆమె మనసుపై ఎలాంటి ప్రభావం పడుతుందో ఆలోచించాలంటూ మీడియా, సోషల్ మీడియాను కోరారు. ఇలాంటి రూమర్లకు స్పందించి తన సమయం, ఆరోగ్యం, ఎనర్జీని వృథా చేసుకోవాలని తనకు లేదని, పాజిటివ్‌గా జీవించడమే తన లక్ష్యమని మీనా స్పష్టం చేశారు. “కర్మ అనేది ఉంటుంది అని అది ఎవరినీ వదిలిపెట్టదు” అనే ఆమె మాటలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. మొత్తానికి ఎప్పుడూ సైలెంట్‌గా ఉండే మీనా ఇలా ఫైర్ అవ్వటం చూసి అభిమానులు ఆశ్చర్యపోతున్నారు. ఇకనైనా ఇలాంటి తప్పుడు ప్రచారాలు ఆగిపోవాలని ఆమె స్పష్టమైన హెచ్చరిక ఇచ్చినట్టే భావించాలి.



## కోటి రూపాయలు పారితోషికం అందుకుంటుంది

‘ధమాకా’ తర్వాత హీరోయిన్ గా శ్రీలీల ఖాతాలో ఒక్క హిట్టు కూడా పడలేదు. బాలకృష్ణ- అనిల్ రావిపూడి కాంబినేషన్లో వచ్చిన ‘భగవంత్ కేసరి’ హిట్ అయినా.. అందులో శ్రీలీల హీరోయిన్ కాదు. అయినప్పటికీ దాని సక్సెస్ క్రెడిట్ శ్రీలీల ఖాతాలో పడలేదు.’స్కంద’ ‘ఆదికేశవ’ ‘ఎక్స్ట్రా ఆర్డియనరీ మెన్’ ‘గుంటూరు కారం’ ‘రాబిన్ హుడ్’ ‘జూనియర్’ ‘మాస్ జాతర’ ‘పరాశక్తి’ ఇలా అన్నీ డిజాస్టర్లే. వేరే హీరోయిన్ ట్రాక్ రికార్డు ఇలా ఉంటే.. ఈపాటికి దుకాణం సర్దేసేది. కానీ శ్రీలీల ఆ విషయంలో లక్కీ అనే చెప్పాలి. ఇన్ని డిజాస్టర్లు పడినప్పటికీ.. ఆమె డిమాండ్ ఏమీ తగ్గలేదు. ఇప్పటికీ ఆమె కోటి రూపాయలు పారితోషికం అందుకుంటుంది. ప్రస్తుతం ఆమె హిందీలో 2 సినిమాల్లో నటిస్తుంది. అవి రెండూ క్రేజీ ప్రాజెక్టులే. మరోవైపు తమిళంలో క్రేజీ ఆఫర్లు అందుకుంటుంది. ధనుష్ 50వ సినిమాలో సాయి పల్లవితో పాటు మరో హీరోయిన్ గా నటిస్తుంది. అలాగే అజిత్ హీరోగా అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమాలో కూడా హీరోయిన్ గా నటిస్తుంది. మరోవైపు పవన్ కళ్యాణ్ కి జోడీగా ‘ఉస్తాద్ భగత్ సింగ్’ సినిమాలో నటించింది. హరీష్ శంకర్ దర్శకత్వం వహించిన సినిమా అది. మార్చి 26న రిలీజ్ అవుతుంది.

# భార్యపై ప్రేమను చాటుకున్న నిక్ జోనస్



తన భార్య, గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా సంస్కృతిని గౌరవిస్తూ ఆయన చేసిన ఈ పని ఇప్పుడు నెటిజన్ల మనసు గెలుచుకుంటోంది. పురుషులు కూడా ఇలా చేయవచ్చా? అని అందరూ ఆశ్చర్యపోయేలా చేసిన ఆ విశేషాలేంటో చూద్దాం.. ఆయన ఒక గ్లోబల్ మ్యూజిక్ ఐకాన్. ఆమె ప్రపంచం మెచ్చిన భారతీయ నటి. వీరిద్దరి జోడీ అంటేనే ఒక సెలబ్రేషన్. తాజాగా ఆ పాప్ సింగర్ తన భార్య నటిస్తున్న ‘ద బ్లఫ్’ సినిమాలోని ‘బ్లడీ మేరీ’ పాత్రకు గుర్తుగా ఒక కాక్టెయిల్ తయారు చేస్తున్న వీడియోను షేర్ చేశారు. అయితే, అందరి దృష్టి ఆ కాక్టెయిల్ మీద కంటే ఆయన మణికట్టుపై ఉన్న ఒక నల్లపూసల గొలుసు మీదకు వెళ్లింది. హిందూ సంప్రదాయంలో కేవలం మహిళలు మాత్రమే ధరించే మంగళసూత్రాన్ని ఆయన బ్రాస్‌లెట్ రూపంలో ధరించడం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఆ పాప్ స్టార్ మరెవరో కాదు.. నిక్ జోనస్. సాధారణంగా మంగళసూత్రం అంటే వివాహితలకు చిహ్నం. నల్లపూసలు, బంగారు సూత్రాలతో ఉండే ఈ పవిత్ర బంధం ఇప్పుడు ఫ్యాషన్ ప్రపంచంలో కొత్త పుంతలు తొక్కుతోంది. గతంలో సోనమ్ కపూర్ తన రాశి చక్రంతో కూడిన మంగళసూత్రాన్ని ఎంచుకోగా, ఆలియా భట్ తన హారంలో ఇన్ఫినిటీ గుర్తును చేర్చుకుంది. రాధికా మర్చంట్ సైతం తన మంగళసూత్రాన్ని బ్రాస్‌లెట్‌గా ధరించి ఆశ్చర్యపరిచింది. అయితే, ఇప్పుడు నిక్ జోనస్ దానిని ధరించడం ద్వారా ఒక సరికొత్త చర్చకు తెరలేపారు. పెళ్లయిన వస్తువులను, గుర్తులను కేవలం మహిళలు మాత్రమే ధరించాలా? అనే చర్చ ఎప్పటి నుంచో ఉంది. చాలామంది పురుషులు పెళ్లి ఉంగరాలను కూడా పెట్టుకోవడానికి ఇష్టపడని ఈ రోజుల్లో, నిక్ జోనస్ తన భార్య దేశపు సంప్రదాయాన్ని తన మణికట్టుపై ధరించడం విశేషం. ఇది కేవలం స్టైల్ కోసం చేసిన ప్రయత్నం కాదు, తన భార్య నమ్మకాల పట్ల ఆయనకు ఉన్న గౌరవానికి, ప్రేమకు నిదర్శనం. భార్యాభర్తలు ఇద్దరూ సమానమే అనే భావనను ఆయన ఈ చిన్న చర్య ద్వారా చాటిచెప్పారు. నిక్ జోనస్ ప్రభావంతో ఇప్పుడు పురుషుల మంగళసూత్ర బ్రాస్‌లెట్లకు విపరీతమైన డిమాండ్ పెరుగుతోందని ప్రముఖ జ్యువెలరీ డిజైనర్లు చెబుతున్నారు. చాలామంది పురుషులు ఇప్పుడు తమ సంబంధాల్లో సమానత్వాన్ని కోరుకుంటున్నారని, అందుకే ఇలాంటి ఆభరణాల పట్ల ఆసక్తి చూపిస్తున్నారని ‘డిఐ డిజైన్స్’ ఫౌండర్ దిశా షా పేర్కొన్నారు. త్వరలోనే పురుషుల కోసం ప్రత్యేకంగా మంగళసూత్ర కలెక్షన్‌ను లాంచ్ చేయడానికి సిద్ధమవుతున్నట్లు ఆమె వెల్లడించారు. లోకమంతా టెక్నాలజీ, ఆధునికత వైపు పరుగులు తీస్తున్నా.. తమ మూలాలను, ఎదుటివారి సంస్కృతిని గౌరవించడమే నిజమైన ప్రేమ అని నిక్ జోనస్ నిరూపించారు. కేవలం సినిమా ప్రమోషన్ కోసం కాకుండా, మనసు నిండా ఉన్న ప్రేమతో ఆయన చేసిన ఈ పనికి నెటిజన్లు ఫిదా అవుతున్నారు. పెళ్లి ఉంగరాలను ఇంట్లో మర్చిపోయే భర్తల కంటే, ఇలా భార్య సంస్కృతిని సొంతం చేసుకునే నిక్ జోనస్ లాంటి భర్తలు కావాలంటూ మహిళలు కామెంట్స్ చేస్తున్నారు.



# లెజెండ్స్ అపూర్వ కలయిక

భారతీయ సినిమా లివింగ్ లెజెండ్స్ కమల్‌హాసన్, రజనీకాంత్ 47 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత కలిసి నటించబోతున్న విషయం తెలిసిందే. ఈ ప్రతిష్టాత్మక సినిమా అప్‌డేట్స్ కోసం యావత్ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. శనివారం ఈ సినిమా తాలూకు అధికారిక ప్రకటన వెలువడింది. రెడ్ జాయింట్ మూవీస్ ఈ చిత్రాన్ని తెరకెక్కించనుంది. నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వం వహిస్తారు. ఈ చిత్రానికి ‘కెహెచ్ ఎ ఆర్‌కే’ అనే వర్కింగ్ టైటిల్‌ను పెట్టారు. 70వ దశకంలో రజనీకాంత్, కమల్‌హాసన్ కలిసి నటించారు. అనంతరకాలంలో వారిద్దరూ భారతీయ సినిమాలో తిరుగులేని స్టార్‌డమ్‌తో లెజెండ్స్‌గా ఎదిగారు. ఈ సందర్భంగా రెడ్ జాయింట్ మూవీస్ ప్రతినిధి మాట్లాడుతూ ‘ఇదొక చారిత్రక ఘట్టం. ఇద్దరు దిగ్గజ నటులతో సినిమా చేయటం గొప్ప బాధ్యతగా భావిస్తున్నాం. మా కల నిజమైన అనుభూతి కలుగుతున్నది. భారీ వ్యయంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నాం’ అన్నారు. ఈ సినిమాకు అనిరుధ్ సంగీతాన్నందిస్తున్నారు.

# అండర్ 18... ఐశ్వర్య రాజేశ్ కొత్త సినిమా

## ఐశ్వర్య రాజేశ్, విక్రాంత్ ప్రధాన పాత్రల్లో రానున్న కొత్త సినిమా



ప్రముఖ నటి ఐశ్వర్య రాజేశ్, నటుడు విక్రాంత్ ప్రధాన పాత్రలలో తెరకెక్కుతున్న కొత్త చిత్రానికి ‘అండర్ 18’ అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సినిమా టైటిల్ లుక్‌ను ప్రముఖ దర్శకుడు వెట్రిమారన్ ఆవిష్కరించడం విశేషం. ఈ చిత్ర దర్శకుడు కార్తీక్ పెరుమాల్‌సామి గతంలో వెట్రిమారన్ దగ్గర అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేశారు. ఎస్ఆర్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై బి. జగదీశ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ‘మద్రాస్‌కారన్’ విజయం తర్వాత ఈ సంస్థ నిర్మిస్తున్న చిత్రమిది. ‘అండర్ 18’ సినిమా వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న ఒక ఎమోషనల్ క్రైమ్ డ్రామా అని చిత్ర యూనిట్ తెలిపింది. నేరం కారణంగా ప్రభావితమైన ఒక కుటుంబం యొక్క భావోద్వేగాలను, క్రైమ్ ప్రపంచంలోని క్రూరమైన కోణాలను ఈ సినిమాలో చూపించనున్నట్లు తెలుస్తోంది. తమిళనాడులోని అంతగా వెలుగులోకి రాని కొన్ని నేరాల నేథ్యాన్ని దర్శకుడు ఈ కథ కోసం ఎంచుకున్నారని సమాచారం. సామాజిక వాస్తవికత, కుటుంబ భావోద్వేగాల కలబోతగా ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ చిత్రంలో కిశోర్‌తో పాటు పలువురు ప్రముఖ నటులు కీలక పాత్రలలో కనిపించనున్నారు. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది. హోసూర్, చెంగల్పట్టు, చెన్నైలోని వాస్తవ లొకేషన్లలో చిత్రీకరణ జరపనున్నారు. ఈ చిత్రానికి ప్రముఖ సినిమాటోగ్రాఫర్, దర్శకుడు వేల్‌రాజ్ కెమెరామ్యాన్‌గా పనిచేస్తుండగా, సామ్ సి.ఎస్. సంగీతం అందిస్తున్నారు. ఇళంగో కృష్ణన్, కార్తీక్ నేతా పాటలకు సాహిత్యం అందిస్తున్నారు.